సాక్షి
తిరుపతి
మంగళవారం । 27 । మే । 2025



ఆర్టీసీ ఆదాయం పెంచండి

ఆర్టీసీ ఆదాయం పెంపునకు సిబ్బంది కృషి చేయాలని ఎండీ తిరుమలరావు పిలుపునిచ్చారు. - 8లో



ధర్నాలతో హోరెత్తిన కలెక్టరేట్

నిరసనలు, ధర్నాలతో కలెక్టరేట్ హోరెత్తింది. సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు నినాదాలు మిన్నంటించారు. - 8లో



చెరువు మట్టి..కొల్లగొట్టి

తిరుపతి రూరల్ పరిధిలోని దళవాయి చెరువులో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టారు. టిప్పర్లతో మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. - 8లో

న్యూస్‌రీల్

7 నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు



ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండల అప్పలాయిగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 6న అంకురార్పణ జరిపించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవదేవేరులు విశిష్ట వాహనాల్లో విహరించనున్నట్లు చెప్పారు. 10వ తేదీ నిర్వహించే శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన దంపతులు రూ.500లు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 74 అర్జీలు



ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 74 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు,ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 91,538 మంది స్వామివారిని దర్శించుకోగా 37,339 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుపతికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టిందని తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. భక్తుల రద్దీని పరిగణనలోకి తీసుకుని వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు నిర్ణయినట్లు చెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారుల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేపట్టామన్నారు. తాత్కాలికంగా నడిపిస్తున్న ప్రత్యేక రైళ్ల ద్వారా, భక్తులు సులభంగా రైలు టికెట్లు పొందవచ్చని తెలిపారు.

ఏం చేయాలబ్బా!

- మినీ మహానాడుకు నియోజకవర్గం నుంచి యాభై వాహనాలు
- తలలు పట్టుకుంటున్న రవాణాశాఖ అధికారులు

తిరుపతి మంగళం: టీడీపీ మినీ మహానాడు రవాణాశాఖకు తలనొప్పిగా మారింది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి యాభై వాహనాలను మినీ మహానాడు సభలకు పంపించాలంటూ కూటమి ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు రవాణాశాఖ అధికారులకు హుకుం జారీ చేసినట్టు సమాచారం. గతంలో సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు మంత్రుల కాన్వాయ్‌లకు ఏర్పాటు చేసిన బకాయిలను ప్రభుత్వం చెల్లించని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మళ్లీ టీడీపీ మినీ మహానాడు సభలకు వాహనాలను పెట్టమని యజమానులను అడిగేందుకు రవాణాశాఖ జంకుతోంది. ఏం చేయాలో దిక్కుతోచక రవాణాశాఖ అధికారులు నానా అవస్థలు పడుతున్నట్లు సమాచారం.

రుణాలకు తొలి ప్రాధాన్యం



కలెక్టర్‌తో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు

తిరుపతి అర్బన్: రైతులతోపాటు పేదలందరికీ బ్యాంక్ రుణాల విషయంలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ శ్రీనివాసకుమార్, తిరుపతి రీజనల్ మేనేజర్ సోమంచి శర్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ మర్యాదపూర్వకంగా కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎక్కువ మందికి బ్యాంక్ రుణాలు ఇప్పించేలా కృషి చేయాలని సూచించారు.

ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

కాలకేయ కూటమి రెడ్‌బుక్ రాజ్యాంగానికి ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. హామీలు గాలికొదిలి అక్రమ అరెస్టుల పర్వం నిరాటంకంగా కొనసాగుతోంది. ఏదో ఒక కేసులో ఇరికించి వైఎస్సార్‌సీపీలోని కీలక నేతలను జైలుకు పంపడం రివాజుగా మారుతోంది. ఇలాంటిదే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. మైనింగ్ వ్యవహారంలో రెండు నెలలుగా టార్గెట్ చేసి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం విమర్శలకు తావిస్తోంది. వెంకటగిరి కోర్టుకు తరలిస్తున్నారన్న సమాచారంతో అభిమాన కెరటం ఎగసిపడింది. ప్రజాప్రతినిధులు, అభిమానులతో వెంకటగిరి పట్టణం కిక్కిరిసింది. 144 సెక్షన్ అమలు నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.



కాకాణి అరెస్టుతో జనసంద్రమైన వెంకటగిరి

కాకాణి అరెస్ట్

- వెంకటగిరిలో ఉద్రిక్తత
- భారీగా తరలివచ్చిన అభిమానులు
- 144 సెక్షన్ అమలు
- అక్రమ అరెస్ట్‌ను ఖండించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వెంకటగిరి (సైదాపురం): ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేశారు. అనవసరమైన కేసుల్లో ఇరికించి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైలుకు పంపారు. సోమవారం ఆయన్ను వెంకటగిరి కోర్టుకు తరలించారు. ఈ క్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెల్లవారు జామునే తన నివాసానికి చేరుకున్నారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేరుకుని కాకాణి అక్రమ రెస్టును ఖండించారు. అక్కడి నుంచి నేతలు, కార్యకర్తలు వెంకటగిరి కోర్టుకు బయల్దేరారు. 144 సెక్షన్ అమల్లో ఉందని, కోర్టు ప్రాంగణంలోకి వెళ్లరాదని పోలీసులు అడ్డుకున్నారు. ఆపై కొందరు ముఖ్య నేతలను కోర్టు ప్రాంగణంలోకి అనుమతించారు. తర్వాత మాజీ మంత్రి అనీల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్యతోపాటు పలువురు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రముఖులు కోర్టు వద్దకు చేరుకున్నారు.

కిక్కిరిసిన కోర్టు ప్రాంగణం

భారీ బందోబస్తు నడుమ నెల్లూరు నుంచి పోలీసు ఎస్కార్ట్ వాహనంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మధ్యాహ్నం 12.11 గంటలకు వెంకటగిరి కోర్టు ఆవరణానికి తీసుకొచ్చారు. తర్వాత ఆయన్ను న్యాయమూర్తి విష్ణువర్మ ఎదుట హాజరు పరిచారు. సుమారు 3 గంటల పాటు వెంకటగిరి కోర్టు ప్రాంగణంలో ఉత్కంఠ నెలకొంది. చివరకు మధ్యాహ్నం భోజన విరామం తర్వాత కాకాణికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. భారీ బందోబస్తు నడుమ నెల్లూరు సెంట్రల్ జైల్‌కు తరలించారు. మధ్యాహ్నం 3.20 గంటలకు కోర్టు భవనం నుంచి కిందకు వచ్చిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అక్కడే ఉన్న వందలాది మంది అభిమానులు జై జగన్... జై గోవర్ధనన్న అంటూ నినాదాలు మిన్నంటించారు. అనంతరం అక్కడి నుంచి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలివెళ్లారు.

కొండంత అభిమానం

కాకాణి అక్రమ అరెస్టుతో వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల నుంచి అభిమానులు, నేతలు భారీగా తరలివచ్చి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ అభిమానులే దర్శనమిచ్చారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు డీఎస్పీ గీతా కుమారి నేతృత్వంలో వెంకటగిరి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కోర్టులోకి అనుమతించాలంటున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి



పోలీసు కాన్వాయ్ ఎక్కుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పరాకాష్టకు 'కూటమి' కుయుక్తులు



మైనింగ్ కేసులో ఏ-1, ఏ-2, ఏ-3కి బెయిల్ వస్తే ఏ-4 మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని దురుద్దేశపూర్వకంగా జైలుకు పంపారు. ఆయనపై నమోదు చేసిన కేసులో బలం లేకపోవడంతో కక్షపూరిత ధోరణితో ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేశారు. దీంతోపాటు మైనింగ్‌లో బ్లాస్టింగ్ చేశారని కేసులు నమోదు చేయడం ఆశ్చర్యమేస్తోంది. సైదాపురం మండలంలో ఇష్టానుసారంగా అక్రమ మైనింగ్, అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్న విషయాలను రాత్ర పూర్వకంగా కలెక్టర్, ఎస్పీ, ఢిల్లీలోని కేంద్ర మైనింగ్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాం. కానీ వారిపై చర్యలు తీసుకోక పోగా ఎలాంటి సంబంధం లేనివారిపై తప్పుడు కేసులు బనాయించి జైలు పాలు చేస్తున్నారు. సమంజసం కాదు.

– నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

కుట్రపూరితంగా కాకాణిపై కేసు



మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేకున్నా అక్రమ మైనింగ్ కేసు నమోదు చేయడం దారుణం. అదే మైనింగ్ వ్యవహారంలో 2023లో విచారణ జరగాక ఎలాంటి అక్రమాలు లేవని అధికారులు ధ్రువీకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అదే అధికారి చేత అక్రమాలు జరిగాయంటూ ఇచ్చిన వివరాలతో కాకాణిపై ఏ-4గా కేసు నమోదు చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వ తీరుపై జూన్ 4న వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహించనున్నాం. కూటమి దౌర్జన్యాలు, అరాచకాలు, భూ మాఫియా, మైనింగ్ మాఫియా, దుర్మార్గాలు ప్రజలు దృష్టికి తీసుకెళ్తాం.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

అక్రమ కేసులకు భయపడం



మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసినా భయపడే ప్రసక్తేలేదు. గోవర్ధన్ రెడ్డిని ఎలాగైనా హింసలకు గురిచేయాలనే కూటమి ప్రభుత్వం అక్రమ మైనింగ్ కేసును బనాయించింది. మైనింగ్ వ్యవహారంలో ఎలాంటి పాత్ర లేని ఆయనపై వివిధ సెక్షన్లపై కేసులు పెట్టి వేధిస్తోంది. ప్రజల పక్షాన నిరంతరం పోరాడే మాజీ మంత్రిపై అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగానికి తెరదీసి అక్రమ కేసులు ఎలా పెట్టాలో నేర్పిస్తున్నారు. జిల్లా ప్రజలు అంతా కాకాణి వెంటే ఉన్నారు. ఆయనకు మద్దతుగా న్యాయపోరాటం కొనసాగిస్తాం.

–అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి

కుట్రలపై న్యాయపోరాటం



మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టు పూర్తిగా అక్రమం. ఇది ముమ్మాటికీ కూటమి కుట్రే. కూటమి ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం కుట్రలకు తెర లేపింది. ఆ క్రమంలోనే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పై అక్రమ కేసులు నమోదు బనాయించింది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. కూటమి అక్రమాలపై ప్రశ్నించే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల గొంతు నొక్కేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. న్యాయస్థానాల ద్వారానే ఈ కుటలపై న్యాయ పోరాటం చేస్తాం.

– డాక్టర్ గురుమూర్తి, తిరుపతి ఎంపీ

అండగా ఉంటాం



కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించే ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకుల గొంతు నొక్కడం బాధాకరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు ఎప్పుడూ లేవు. కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మేమంతా అండగా ఉంటాం. న్యాయం గెలిచేవరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తాం.

- మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ

అప్రజాస్వామికం



ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామికం. ఆయనకు మేమంతా అండగా ఉంటాం. కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

డైవర్షన్ పాలిటిక్స్



ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదారి మళ్లించేందుకు వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. కూటమి తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయం.

– కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి

కలసికట్టుగా పోరుబాట

- హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ కార్యాచరణ
- అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు
- అధినేత ఆదేశాల మేరకు సమావేశమైన పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు
- 4న 'వెన్నుపోటు దినం' పాటించాలని పిలుపు



సమావేశంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ ఉమ్మడి జిల్లాల పార్లమెంట్ అధ్యక్షుడు మేడా రఘునాథరెడ్డి, చావా రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, నియోజకవర్గాల సమన్వయకర్తలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని పక్కనపెట్టి అక్రమ కేసులు, అరెస్టులు, దాడులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కూటమి ప్రభుత్వంపై కలసికట్టుగా పోరుబాట పట్టాలని వైఎస్సార్‌సీపీ నేతలు సంకల్పించారు. ఈ మేరకు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశారు. సోమవారం తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పరిశీలకులు, ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, తిరుపతి, చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి, చావా రాజశేఖరరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, నియోజకవర్గాల సమన్వయకర్తలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భూమన అభినయరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్, విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, వెంకటేగౌడ, భరత్‌కృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి శివశంకరరెడ్డి హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ దగాకోరు విధానాలకు నిరసనగా జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం పాటించాలని, ఈ మేరకు కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

వెన్నుపోటు దినం.. విజయవంతం చేద్దాం

'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నేతలు పకడ్బందీ కార్యాచరణ రూపొందించారు. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ల వద్ద చేపట్టే నిరసనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు,, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వ అసమర్థతపై ప్రజా వ్యతిరేకత దశదిశగా ప్రతిధ్వనించేలా కార్యక్రమం నిర్వహించాలని సంకల్పించారు. రాష్ట్రంలోని మహిళలు, రైతులు, యువత, విద్యార్థులను పథకాల పేరుతో మోసం చేసిన చంద్రబాబుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని స్పష్టం చేశబూరు. దగా పడిన జనానికి అండగా నిలిచి పోరాడాల్సిన బాధ్యత తమ మీద ఉందని వెల్లడించారు. అందుకే ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని, సామాన్య ప్రజలను సైతం భాగస్వాములు చేయాలని సూచించారు.

ప్రతిఘటిస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్ చేసుకుని కుట్రలు, కుతంత్రాలతో భయానక వాతావరణాన్ని సృష్టించాలని చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు కార్యకర్తలను సైతం బెదిరిస్తున్నారు. వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అందులో భాగంగానే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీద తప్పుడు కేసులు బనాయించారు. మా పార్టీ నాయకులపై ఎన్ని కేసులు పెడతారో, ఎంతగా బెదిరిస్తారో అంతగా మేం ప్రతిఘటించి ఉద్యమిస్తాం.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు

కాకాణి అరెస్ట్ అక్రమం

ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నందుకు రాజకీయ కక్షతోనే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఈ అరెస్ట్ అక్రమం. ఆయన అరెస్టును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ అరెస్టుతో కూటమి ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత పెరిగింది. అధికారం కోసం మామ ఎన్టీఆర్‌ని ఎలా వెన్నుపోటు పొడిచారో.. అదే అధికారం కోసం చంద్రబాబు అలవిగాని హామీలు ఇచ్చి మోసపూరితంగా అధికారంలోకి వచ్చారు. మామను వెన్నుపోటు పొడిచినట్టే.. ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచారు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి

ఆ ధైర్యం ఉందా?

కూటమి పాలన ఏడాది పూర్తయి మహానాడు నిర్వహించనుందని, ఆ మహానాడులో ఇచ్చిన హామీలు నెరవేర్చాం అని చెప్పే దమ్ముందా?. పచ్చ చానెళ్లతో తప్పుడు ప్రచారాలు, పోలీసులతో వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించడం, నాయకులు, కార్యకర్తలను వేధించడం మినహా చేసిందేమీ లేదు. మద్యం కుంభ కోణం అంటూ నేడు అధికార పార్టీ ఊదరగొట్టడం కూడా హామీలు నెరవేర్చలేదని ప్రజలు ప్రశ్నించకుండా చేసే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, కృష్ణమోహన్, ధనంజయులు రెడ్డిపై కేసులు పెట్టడం చూస్తే ఇవన్నీ రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం పెట్టిన కేసులే అని తెలుస్తోంది. జగనన్న అధికారంలోకి రావడం ఖాయం. అప్పుడు వారికి అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా శిక్షపడేలా చేస్తాం.

– ఆర్‌కే రోజా, మాజీ మంత్రి

టీటీడీ అటానమస్ కళాశాలల డిగ్రీ ఫలితాలు విడుదల



ఎస్పీడబ్ల్యూలో ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న అటానమస్ కళాశాలలో డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలను సోమవారం ఎస్పీడబ్ల్యూ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ, గత నెల 28 నుంచి మే 7వ తేదీ వరకు అటానమస్ హోదాలో నిర్వహించిన డిగ్రీ ఫస్ట్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ ఫలితాలను 20రోజుల లోపే విడుదల చేయడం గర్వంగా ఉందన్నారు. ఫలితాల కోసం విద్యార్థులు కళాశాలల అధికారిక వెబ్‌సైట్‌లో, కళాశాల నోటీస్ బోర్డులో చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్, ఎస్పీడబ్ల్యూ కళాశాలల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఫలితాలను మరో నాలుగు రోజులలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

స్టార్టర్ల చోరీ



ఎండీ పుత్తూరులో చోరీకి గురైన స్టార్టర్లు

ఏర్పేడు: ఏర్పేడు మండలం, ఎండీ పుత్తూరు గ్రామ పొలాల్లో ఆదివారం రాత్రి 50 మంది రైతులకు సంబంధించిన వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీకి గురయ్యారు. వరి మడులను నాట్లకు సిద్ధం చేసుకున్న తరుణంలో ఇలా చోరీ చేయడం దారుణమన్నారు. దొంగలను పట్టుకుని స్టార్టర్ల చోరీలను అరికట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఏటీఎం మార్చి నగదు చోరీ

తిరుపతి క్రైమ్: టీటీడీ ఏడీ బిల్డింగ్ ఏటీఎం సెంటర్ వద్ద నగదు డ్రా చేస్తానని ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టీటీడీలో పనిచేస్తున్న వేలు భార్య సంగీత ఏటీఎం వద్దకు చేరుకొని రూ.20 వేలు డ్రా చేసింది. మరోసారి రూ.15 వేలు డ్రా చేసేందుకు ప్రయత్నించగా నగదు రాకపోవడంతో వెనుక ఉన్న గుర్తుతెలియని వ్యక్తికి ఏటీఎం ఇచ్చింది. దీంతో ఆ వ్యక్తి ఏటీఎం కార్డు మార్చి తిరిగి ఆమెకి ఇచ్చి పంపించాడు. అదే టైంలో రూ.5 వేలు డ్రా చేసి మరోమారు రూ.15 వేలను చిత్తూరు కేఆర్ ఫీలింగ్ స్టేషన్లో డ్రా చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. అప్రమత్తమైన సంగీత తన అకౌంట్లోని సొమ్మును భర్త అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసింది. అనంతరం అలిపిరి పోలీసులకు సమాచారం ఇచ్చింది. కేసు దర్యాప్తులో ఉంది.

జూన్‌లో విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూన్‌లో జరగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్వో విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. జూన్ 5న మెయిన్ వరదరాజస్వామి వర్షతిరు నక్షత్రం, 9న శ్రీవారి జ్యేష్ఠాభిషేకం ప్రారంభం, నమ్మాళ్వార్ శాత్తుమొర, 11న శ్రీవారి జ్యేష్ఠాభిషేకం సమాప్తం, 21 స్మార్త ఏకాదశి, 22న వైష్ణవ మాధ్వ ఏకాదశి, 26న పెరియాళ్వార్ ఉత్సవారంభం ఉంటుందని వెల్లడించింది.

ధర్నాలతో హోరెత్తిన కలెక్టరేట్

- గ్రీవెన్స్‌కు సమస్యల వెల్లువ

తిరుపతి అర్బన్: వివిధ సమస్యలపై తిరుపతి కలెక్టరేట్ ధర్నాలలో హోరెత్తింది. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని పలు ప్రాంతాల అర్జీదారుల నుంచి ఉన్నతాధికారులు కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్, రోజ్‌మాండ్, సుధారాణి, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 268 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ సమస్యలపై 150 ఉండటం గమనార్హం! అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

చంద్రగిరిలో మట్టి దోపిడీ

చంద్రగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని, దీనికి చెక్ పెట్టాలని సీపీఎం, సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ప్రధానంగా చంద్రగిరి ప్రభుత్వ బాలుర హాస్టల్ వద్ద మట్టిని తవ్వి వందల ట్రిప్పులు తరలిస్తున్నారని, అలాగే రామచంద్రాపురం మండలంలో రామాపురం నుంచి పచ్చికాపల్లం రోడ్డు మార్గంలో కొండలన్నీ తవ్వి ఎర్రమట్టిని తరలిస్తున్నారని, ఒక్కో ఎర్రమట్టి ట్రిప్పు రూ.30వేలకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.



విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయొద్దని ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు

ఆటోడ్రైవర్ భాగ్యశ్రీకి పింఛను మంజూరు చేయాలి

మంగళం అంబేడ్కర్ కాలనీకి చెందిన ఒంటరి మహిళ, ఆటో డ్రైవరైన భాగ్యశ్రీపై గత నెల 27న ఓ వర్గానికి చెందిన కొందరు దాడులు చేయడంతో ఆమె మంచానికే పరిమితమయ్యారని...ఆమెకు పింఛను మంజూరు చేసి న్యాయం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి కోరారు.

ఎస్టీ వర్గీకరణ కోసం పోరుబాట

ఎస్సీ వర్గీకరణ తరహాలో ఎస్టీ వర్గీకరణ చేయాలని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య యానాది డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద పోరుబాట పేరిట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 10లక్షల మంది యానాదాలు ఉన్నారని, గిరిజనుల్లో జనాభా ప్రకారం మొదటి స్థానంలో యానాదులు ఉన్నప్పటికీ అన్నింటా తమకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని, ఎస్టీ వర్గీకరణ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యానాది సంఘం నేతలు చేవూరు సుబ్బారావు, బాపట్ల బ్రహ్మయ్య, తలపల మల్లికార్జున, యల్లంపాటి వెంకటరమణ, అత్తూరు చెంగల్ రాయులు, శ్రీమంతుల రామయ్య, రేవతి, రాములమ్మ, చెంబేటి ఉష తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ వర్గీకరణ చేయాలని ధర్నా చేస్తున్న యానాదులు

విశాఖ ఉక్కును రక్షించుకుందాం

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని రక్షించుకోవడానికి సమష్టిగా కృషి చేద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఏఐటీయూసీ నగర కార్యదర్శి రాజా, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి లోకేష్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ వద్ద చేసిన ధర్నాలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న వారిలో 4వేల మందిని తొలగించడం తగదని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, విశాఖ ఉక్కు కోసం 32 మంది ప్రాణాలు త్యాగం చేశారన్నారు. ఆ సమయంలో 60 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు సైతం రాజీనామా చేశారని తెలియజేశారు. ఇంతటి చరిత్ర కలిగిన ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఓ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు హరినాథ్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వెంకటరత్నం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమన్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రద్దీ నేపథ్యంలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ తగ్గనంటోంది. రద్దీ కారణంగా దర్శన సమయం ఆలస్యమవుతున్నప్పటికీ భక్తులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా టీటీడీ చర్యలు చేపడుతోంది. దర్శన క్యూలైన్లలో శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు అన్న, పానీయాలను నిరంతరాయంగా పంపిణీ చేస్తోంది. విజిలెన్స్, ఆలయ విభాగాలు సమర్థవంతంగా క్యూలైన్లను నిర్వహిస్తున్నాయి. సాధారణ రోజుల్లో కంటే 10వేల మంది భక్తులకు అదనంగా దర్శన భాగ్యం కలుగుతోంది. గత నాలుగు రోజుల్లో (గురు, శుక్ర, శని, ఆదివారాల్లో) శ్రీవాణి దర్శనాలు కొనసాగుతున్నపటికీ 3,28,702 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 10,98,170 మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందించగా, 4,55,160 మంది భక్తులకు పానీయాలు (టీ, కాఫీ, పాలు, మజ్జిగ) అందించారు. ఈ నాలుగు రోజుల్లో 1,52,587 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, టీటీడీ వైద్య విభాగం ద్వారా తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో 12,172 మంది భక్తులు వైద్య సేవలు పొందారు. క్యూలైన్లలో ఆరోగ్యశాఖ నిరంతరాయంగా తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతను నిర్వహిస్తోంది. మొత్తం 2,150 మంది శానిటరీ కార్మికులు, సూపర్‌వైజర్లు, మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, యూనిట్ అధికారులు భక్తుల కోసం మూడు షిఫ్టుల్లో 24 గంటలూ సేవలు అందిస్తున్నారు. టీటీడీ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తున్నారు.

రీవాల్యుయేషన్‌లో అక్ర'మార్కులు'!

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎస్వీయూలో డిగ్రీ, పీజీ పరీక్ష పేపర్ల రీ–వాల్యువేషన్ ప్రక్రియలో జరుగుతున్న గోల్‌మాల్‌ను అధికారులు సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో వర్సిటీలోని కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డిగ్రీకి సంబంధించిన పలు పరీక్షా ఫలితాలపై సంతృప్తి చెందని విద్యార్థులు తమకు మార్కులు తక్కువ వచ్చాయంటూ వందల సంఖ్యలో రీవాల్యువేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇదే అవకాశంగా ఎగ్జామినేషన్ సెక్షన్‌లో పనిచేస్తున్న కొందరు ఎక్కువ మార్కులు వేయిస్తామంటూ వేలల్లో వసూలు చేస్తున్నారు. దీనిపై సాక్షాత్తు ఎగ్జామినేషన్ సెక్షన్‌లో పనిచేసే ఓ అధికారి వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం! ఇదే విషయంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కొన్ని సెమిస్టర్ల డిగ్రీ, పీజీ పరీక్ష పేపర్ల రీవాల్యువేషన్‌లో మళ్లీ తప్పులు దొర్లడంతో అధికారులకు అనుమానం వచ్చి ఉద్యోగులను నిలదీశారు. రీవాల్యువేషన్ చేసిన పేపర్లను తమ ముందు ఉంచాలని ఎగ్జామినేషన్ సెక్షన్ సిబ్బందిని నిలదీశారు. ఈ పరిస్థితిని ఊహించని ఎగ్జామినేషన్ సిబ్బంది కొందరు తెల్లముఖం వేసినట్లు తెలుస్తోంది.

ఆర్టీసీ ఆదాయం పెంచండి



ఆర్టీసీ డ్రైవర్లకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆర్టీసీ ఎండీ

సత్యవేడు: సమయానికి బస్సులు నడుపుతూ, డ్రైవర్లు, కండక్టర్లు సమయపాలన పాటిస్తూ, ప్రయాణికులు చేయి ఎత్తిన చోట బస్సు ఆపుతూ ఆర్టీసీకి ఆదాయం పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు పిలుపునిచ్చారు. సోమవారం సత్యవేడు ఆర్టీసీ డిపోను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ వేసవిలో ఆర్టీసీ బస్టాప్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ సత్యవేడు డిపో నుంచి విజయవాడ సర్వీసు, ఊత్తుకోట మీదుగా చెన్నై సర్వీసు, సత్యవేడు–చిత్తూరు సర్వీసు, సూళ్లూరుపేట– ఊత్తుకోట సర్వీసులు నడపాలని కోరారు. నాగలాపురం ఆర్టీసీ బస్టాండును ఆధునీకరించాలన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

ఉత్తమ డ్రైవర్లను ఎండీ ఘనంగా సత్కరించారు. ఇందులో ఆయిల్ సేవ్ అవార్డులను డ్రైవర్లు ఎం.మధు, వీరయ్యకు అందజేశారు. బెంగళూరు సర్వీసులో అధిక ఆదాయం తీసుకొచ్చిన డ్రైవర్ సురేష్‌కు క్యాష్ అవార్డులు అందజేశారు. ఈడీ చెంగల్‌రెడ్డి, ఆర్ఎం వెంకటరమణ, డీఎం వెంకటరత్నం, ఆర్టీసీ యూనియన్ నాయకులు చెంచులయ్య, బాబు, గోవిందయ్య, మురళీ(చికెన్ చిన్నా), వికేఎస్ పరమశిం(బాషా), బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళవాయి చెరువులో చెలరేగుతున్న మట్టి మాఫియా

- హైవే విస్తరణ పనుల ముసుగులో దోపిడీ
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- అధికారమే అండగా బరితెగించిన ఓ బడా నాయకుడు
- ఆందోళనలకు సిద్ధమవుతున్న ఆయకట్టు రైతులు

చెరువు మట్టి..కొల్లగొట్టి



మట్టి అక్రమ తవ్వకాలకు చెరువులో భారీ యంత్రాలు



దళవాయి చెరువులో విలువైన ఎర్ర మట్టిని తవ్వుతున్న అక్రమార్కులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్లపల్లి సమీపంలోని దళవాయి చెరువులో నుంచి రెండు నెలలుగా మట్టిని తరలిస్తున్నారు. రోజుకు పది టిప్పర్ల చొప్పున ఒక్కో టిప్పర్ పది ట్రిప్పుల వంతున వంద ట్రిప్పుల మట్టిని కొల్లగొడుతున్నారు. హైవే రోడ్డు విస్తరణ పనుల ముసుగులో ఎర్రమట్టిని గుట్టుగా తరలించి కోట్లు సంపాదిస్తున్నారు. ఈ మట్టిని ఇటుక బట్టీలకు అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

టిప్పరు ఎర్రమట్టి రూ.10 వేలు

చెరువులో మట్టి ఇటుకల తయారీకి అనుకూలంగా ఉంటోంది. చుట్టు పక్కల ప్రాంతాలలో తయారుచేసే ఇటుక బట్టీలకు చెరువులోని మట్టిని విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ ఒక్కో ట్రిప్పు మట్టి విలువ సుమారు రూ.10 వేలు.. ఆ లెక్కన రోజూ 100 ట్రిప్పుల మట్టి విలువ దాదాపు రూ.10 లక్షలు. అంటే రోజుకు రూ.10లక్షలు లెక్కన నెలకు రూ.3 కోట్ల పైచిలుకు మట్టి వ్యాపారం జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ రెండు నెలల కాలంలో మట్టి అక్రమార్కులు దాదాపు రూ.6 కోట్ల విలువైన మట్టిని తవ్వేసినట్టు సమాచారం.

మామూళ్ల మత్తులో అధికారులు

హైవే విస్తరణ పనులకు చెరువులలో మట్టి తరలింపు చేయాలంటే ప్రభుత్వం నుంచి ముందుగా అనుమతులు తీసుకోవాలి. మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చే ముందు సంబంధిత నీటి పారుదల శాఖ నుంచి నిరభ్యంతర లేఖను తీసుకుని, ఆపై ప్రభుత్వ నిబంధనల మేరకు డబ్బులు చెల్లించుకుని సదరు కాంట్రాక్టర్‌కు నిర్దేశించిన ప్రదేశంలో నిర్ణయించిన లోతు మేరకు మట్టిని తవ్వుకునే అనుమతులు పొందాల్సి. కానీ దళవాయి చెరువులో ఇవేవీ అమలు కావడం లేదు. ఎలాంటి అనుమతులు లేకపోగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి అక్రమ రవాణాకు నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు మైనింగ్ అధికారులు సైతం పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని ఆయకట్టు దారులు ఆరోపిస్తున్నారు. మట్టి వ్యాపారులు అందించే మామూళ్లకు కక్కుర్తి పడి అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళవాయి చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను స్థానికంగా నివాసముంటున్న ఓ అధికారి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా 'మట్టి అక్రమ రవాణాను తాను కూడా గమనిస్తున్నానని, అయినా ఏమీ చేయలేక పోతున్నాం' అంటూ చేతులెత్తేయడం గమనార్హం. ఇరిగేషన్ ఏఈఈ రవిశంకర్‌ను వివరణ కోరగా అక్కడ మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని, మట్టి తరలింపును నిలిపివేశామని చెప్పారు. గత రెండు నెలలుగా 30 అడుగుల లోతు తవ్వేసినందుకు వారిపై ఏరకమైన చర్యలు తీసుకున్నారన్న ప్రశ్నకు ఆ అధికారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.

బరితెంగించిన బడా నాయకుడు

హైవే విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఓ రాజకీయ పార్టీలో నియోజకవర్గ స్థాయి నాయకునిగా చెలామని అవుతున్నారు. ఆ బడా నాయకుడు తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని సమీప గ్రామాల ప్రజల విన్నపాలను లెక్క చేయకుండా అధికారులను బెదిరిస్తూ యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వేస్తున్నట్టు సమాచారం. హైవే అథారిటీ నుంచి నీటి పారుదల శాఖ, మైనింగ్ శాఖ అధికారులకు మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలన్న రిక్వెస్ట్ లెటర్ చేతబట్టుకుని అడ్డగోలు గా తవ్వకాలు సాగించేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ పార్టీలో ఉన్న ఆ నాయకుని జోలి కి వెళ్లడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ఇదే అదునుగా దళవాయి చెరువును రాత్రి, పగలు తేడా లేకుండా కొల్లగొడుతున్నారు. ఇలాగే మట్టి రవాణా చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆ చెరువు ఆయకట్టుదారులు, సమీప గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ ముఖ్యం

– నేడు ఆర్టీఓ కార్యాలయంలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్‌పై శిక్షణ

తిరుపతి మంగళం : వాహనదారులంతా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం సందర్భంగా మంగళంలోని ప్రాంతీయ రవాణా శాఖాధికారి కార్యాలయంలో కార్డియో పల్మనరీ రిసిసిటేషన్ బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్ శిక్షణా కార్యక్రమాన్ని అమర ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో ప్రాణాలు నిలబెట్టే ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రాణాలను రక్షించే అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. శిక్షణలో పాల్గొనే వైద్య నిపుణుల గురించి తెలియజేశారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ



గోడౌన్లను తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈఓ విశ్వేశ్వరరావు, కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: రేణిగుంట పాత విమానాశ్రయం రహదారిలో ఉన్న ఈవీఎంస్, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గోడౌన్లను సోమవారం డిప్యూటీ సీఈఓ విశ్వేశ్వరరావుతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా షట్టర్లకు వేసిన సీళ్లను, సీసీ కెమెరాలను పరిశీలించి, భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, జీఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి సుధారాణి, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, ఎన్నికల సూపరింటిండెంట్ ప్రసాద్, రేణిగుంట తహసీల్దార్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అతి త్వరలో డిగ్రీ అధ్యాపకుల బదిలీలు

తిరుపతి సిటీ: జిల్లాలోని దాదాపు 18 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం నేడో.. రేపో అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌కు అనుమతి నిచ్చింది. దీంతో సీసీఈ బదిలీల ప్రక్రియకు సంబంధించి విధి విధానాలను రూపకల్పన చేసే పనిలో తలమునకలైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 100మంది అధ్యాపకులు బదిలీల ప్రక్రియకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఐదేళ్లు ఒకే కళాశాలలో పనిచేసిన అధ్యాపకులకు తప్పనిసరిగా స్థానచలనం కల్పించనున్నారు. అలాగే స్పౌస్ కేసులు, సింగిల్ ఉమెన్, ఫిజికల్లీ ఛాలెంజ్డ్ అధ్యాపకులకు బదిలీలో ప్రాధాన్యత ఇస్తారు.

కలెక్టరేట్ వద్ద మామిడి రైతుల ఆందోళన

తిరుపతి అర్బన్: జిల్లాలోని మామిడి రైతులు గిట్టుబాటు ధర కోసం సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, జూన్ నుంచి మామిడి పంట చేతికొస్తుందని, తమ పంటను సకాలంలో మామిడి ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో 22వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉందని, న్యాయం చేయకుంటే 18వేల మంది మామిడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

శుభకార్యం జరగాల్సిన ఇంట విషాదం

– పిడుగుపాటుకు యువకుడు మృతి

చిల్లకూరు:బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభ కార్యానికి హాజరైన ఓ యువకుడు పిడుగు పాటుకు గురై మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొన్న ఘటన తీర ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని తీర ప్రాంత గ్రామమైన గుమ్మళ్లదిబ్బ గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబంలో సోమవా రం నిశ్చితార్థం ఉండడంతో బంధువులను ఆహ్వానించారు. వీరిలో ఊటీలో ఉండే అసుద్దీన్(17) కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం గ్రామానికి చేరుకున్నాడు. సాయంత్రం బంధువుల పిల్లలతో కలిసి కండలేరు క్రీక్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో జోరు వాన పడడంతో పాటు సమీపంలో పిడుగుపడింది. దీంతో అసుద్దీన్‌తో పాటు ఉన్న యువకులు నేలపై పడుకోగా అతను అలాగే నిలుచుకుని ఉండడంతో పిడుగు పడడంతో కుప్పకూలిపోయాడు. తోడుగా వచ్చిన వారు లేపడానికి ప్రయత్నించినా.. ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే యువకుడు మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు వచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా వీఆర్ఓ ద్వారా వివరాలను సేకరించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.